పోయిన పుటలు

★

శ్రీ అంగర వెంకటకృష్ణారావు

నేను అదనపుజిల్లా మేజస్ట్రేటువద్ద క్యాంపు గుమాస్తాగా వున్న రోజులలో జరిగిన వొక సంఘటన, నన్నమాంతంగా వొక దశాబ్దానికి పైగా వెనక్కు నెట్టింది.

ఆ రోజులలో నాకు రోజు కొక అరగంట సంక్షిప్తలేఖనం, సుమారొక గంట టైపుపని వుండేవి. మా ఆఫీసరుగారు న్యాయమైన ప్రభుత్వాధికారి, నిజమైన ప్రజాసేవకుడు. ఇంటికి రావొద్దని చెప్పిన గజిటెడ్ ఉద్యోగి నా యెరికలో అతనొకడే.

కాని నే నక్కడ అట్టే కాలం మనలేక పోయేను. అక్కడ నా జీవితం నిర్మానుష్య ద్వీపంలో 'క్రూసో' బ్రతుకులా వుండేది. మోసం ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా జీవిస్తూన్న ఆ ఆఫీసు కుడ్యాల మధ్య నాకు వూపిరిసలిపింది కాదు. నిర్వ్యాపకంగా వున్న నిముషాల్లో, సంఘానికి, జీవితానికి, నాకు గల సామరస్య వైషమ్యాలు వూహాకందక, శూన్యంలో మనసు కరిగి కలిసిపోవడం పరిపాటిగా వుండేది.

అట్లాంటి సమాధిపరిస్థితిలో నే వున్న వొకనాటి మధ్యాహ్నం బంట్రోతు వచ్చి 'బాబూ— సిన్న పిటీసను టైపు సెయ్యండి' అని బ్రతిమాలేడు. సమాధిలో వుండే, ఆ కాగితం అందుకుని, అప్రయత్నంగా చివరవరకూ చదివేను.

'ఎవరిదోయ్ యీ పిటిషను ?'

'ఒక బీద బ్రామ్మడిదండి'

'అతనిని పిలు' బంట్రోతు వెళ్ళేడు.

పిటిషను వ్రాసిన ఆ సామి వచ్చేవరకూ నా మనసు దట్టమైన పొగమంచు క్రమ్మిన హేమంత చంద్రికారాత్రివలె వుంది. అతడు వచ్చి నాముందు నిలబడ్డాడు—లోతుకు పోయిన బుగ్గలు—చెడు కాలపు జలగ నెత్తురు యావత్తూ పీల్చివేయగా మిగిలిన బొమికెలపోగు! జరిగిపోయిన రోజులను కబళించిన విస్మృతి అనే చీకటిని చీల్చ ప్రయత్నిస్తూంది నా జ్ఞాపకశక్తి...విస్మృతిరాహువు దవడలు పగులుతూంటే, క్రమేపీ జ్ఞాపకంలోకి వుదయిస్తున్నా డా వ్యక్తి—అదంతా వొక పెద్ద ఆపరేషనులా వుంది. అతని ఫాలభాగం వెడల్పై, కాంతి తేరి, బాలారుణ బింబంవంటి కుంకుమరేఖతో విరాజిల్లింది. తరుణ రక్తం పూరించి బుగ్గలు మిసమిసలాడేయి. అధ్యయన ప్రభావం వల్ల తేజస్సు కలిగిన ఆ నేత్రాలు తిరిగి తళుకులు కులికేయి. కెరటంలా ఛాతీ లేచింది. దంతలలో కండలు కమ్మెచ్చులు తిరిగేయి. పదిహేనేళ్ళ క్రిందటి విగ్రహం నామదిలో పొడచూపింది.

'పతంజలిశాస్త్రిగారూ! నేను జ్ఞాపకం వున్నానా!' హఠాత్తుగా అతడి శుష్క నేత్రాలలో గుడ్లు మరీ లోతుకు కుంచుకపోయేయి.

'లేనండి!' చిరిగిపోయిన డప్పులా ఆ గొంతు భయపెట్టింది. అతను యింటికోసం వ్రాసిన అర్జీ కాగితం నా చేతులోంచి జారి క్రింద పడిపోయింది. ఒక ధర్మాత్ముడు తన యిళ్ళలో వొకటి సద్బ్రాహ్మణ కుటుంబానికి నివాసంగా యిచ్చేనిమిత్తం శేటాయించి, ఆ అధికారం జిల్లా కలెక్టరుకిచ్చి చనిపోయేడు—ఆ యిల్లు తన కిమ్మని అర్జీ దాఖలు చెయ్యబోతున్నాడీ సద్బ్రాహ్మణుడు!

'శాస్త్రిగారూ, మీరు వీరనగరంలో కొన్నాళ్ళున్నారుకదూ ?'

'అవునండి' అతడు తడబడ్డాడు. 'కాని... మీ రెవరో నాకు తెలీదు. నేను మీ రనుకున్న మనిషిని కాను—మనిషిని పోలిన మనిషుంటాడు.' ఆ మాటలలో జాలి, దొంగతనం, బిడియం, యస్కేపిజం, కుస్తీలు పడుతున్నాయి.

నా మానసావనికమీద గతించిన రోజులు, ఆటలు, నవ్వులు, యెన్నెన్నో దృశ్యాలుగా మహోద్ధృతితో విరిసి, కరిగి, మాయమౌతున్నాయి.

'మీరు ఆంజనేయస్వామిమఠంలో కుమా

రైదేళ్లుండి 'ఘన' పరీక్షకు చదువుకున్నారు కదూ?' అతని కుడిచెయ్యి అప్రయత్నంగా ముఖాన్ని కప్పింది. గదిలోకి జొరబడిన తటిత్కాంతి మెరుపై పోగానే మాయమైనట్టు, వెనుదిరిగి అతడు వెడిపోయేడు. అప్రమత్తుడనై వున్న నా మనసింకా శూన్యంగానే వుంది. బంట్రోతు కేమీ అర్థంకాక నోరెల్లబెట్టి 'యెవడు బాబీ పంతులు' అన్నాడు. నా దృష్టి భూపతనమైన 'పతంజలి శాస్త్రి' సంతకంమీద పడింది.

* * * *

ఉదయం ఆరుగంటల వేళ, పడమటికేసి నీడలు పొడవుగా వ్యాపింపజేస్తూన్న నీరెండలో పొగమంచు కరిగి తుషార వర్షాన్ని భ్రమింపజేస్తూంది. లెక్కలు చెయ్యడానికి చాపేసి కూచోగానే వొక యెఱ్ఱి తేలు అంటబొడిచింది. మొఱ్ఱో అని కేకపెట్టి గంతేను. రెండు మూడు నిమిషాలు గడిచేక మఠం లోంచి వచ్చిన ఆ వ్యక్తి వొక మంత్రం వెయ్యగానే బాధ పటాపంచలైంది. ఆ తరువాత మా యింట్లో పెద్దవాళ్లు కనుక్కోగా తెలిసింది అతడు చదువుకోడానికి ఆ తొలినాడే వచ్చేడని—అతని పేరు పతంజలిశాస్త్రి—పద్దెనిమిదేళ్లవాడు.

ఆంజనేయస్వామి మఠం వొక జమీందారుది. దానిలో వేద పాఠశాల వుంది. పండితులకు వైదీకం, వటుగులకు బ్రాహ్మణీకం హెచ్చు కావటంచేత అధ్యయనం సన్నగిల్లింది—బడి కూడిననాడు గురుశిష్యులు గుంపులు గుంపులుగా చేరి, వర్షాకాలపు కప్పలవలె నమక చమకాలు అదే పనిగా వల్లించేవారు. ఎగవేస్తే పది పదిహేను దినాలవరకూ ఫికరుండేవారు కారు. కాని ఆ మఠం నావంటి కుఱ్ఱకారుకు చాలా వుపయోగపడేది—మేం దాని మండపంమీద దొంగాటలాడుతూ, పొగడ చెట్టెక్కి పళ్లుతింటూ—వెనకప్రక్క చెరువు నంటివున్న పెరటిలో బాదం చెట్టుమీద కోతి పిల్లిన గఱ్ఱి ఆడుకుంటూ హాయిగా వుండేవాళ్లం. అందరికన్న పెద్ద ఆటలలో 'లీడరు' నేనే—నాకు ఆంజనేయులనే 'అసిస్టెంటు' వుండేవాడు. వాడు పేరుకు తగ్గట్టూ మహా అల్లరి చేసేవాడు. నేనూ అల్లరి చేసేవాడిని, కాని తెలివిగా మెసిలేవాడిని. ఆంజనేయుల్ని సాధారణంగా పెద్దవాళ్లు మేదర మంచం చేస్తూండేవారు.

పతంజలిశాస్త్రి వచ్చిన రెండో నాడుదయం నేను మా వీధి చావడిలో చదువుకుంటూంటే గంభీర స్వరంతో అతని గదిలోంచి వినవస్తూంది,—'కిరీటినం గదినం చక్రిణంచ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్ పశ్యామిత్వాం దుర్నిరీక్ష్యం సమన్తా ద్దీప్తానలార్క ద్యుతి మప్రమేయమ్...' నాకా వాక్యాల కర్థం తెలియనప్పటికీ, ఆ గీతా వాక్యంలోని శక్తి, శంఖారవంవలె జీరలేని శాస్త్రి కంఠగాంభీర్యం నన్నటు ఆకర్షించేయి. మఠం మెట్లెక్కి శాస్త్రి గది వేపు వెళ్లేను. తలుపు ఓరోకలిగా వుంది. లోనికి జొరడానికి జంకు కలిగింది. కాని ఆ గీతాస్రవంతి బుడగ బుడగలై, నురగలు క్రక్కుతూ, తుద కొక మహా ఝుర్నరిగా ప్రవహిస్తూంది...'దంష్ట్రా కరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానల సన్నిభాని, దిశో నజానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ! జగన్నివాస...' తలుపు తోసేను. నీలివర్ణం పట్టుపంచ ధరించి, విభూతి త్రిపుండ్రాంకితములైన ఫాలభాగము దండలు కలిగి, గాయత్ర్యుపాసనాలబ్ధమైన ఓజస్సుతో రెండవ సూర్యుడిలా ప్రకాశిస్తూన్న శాస్త్రి, పూదోత్తులు వెలిగించి శంకరుడి పటానికి తగిలిస్తున్నాడు.

'రా అబ్బాయ్' నేను లోన ప్రవేశించా. విశాల నేత్రాలు తేజఃపుంజాలు ప్రసరిస్తున్నాయి.

'నీ పేరేమిటమ్మా'

'గోపాలం—శాస్త్రిగారూ. మీరిందాకా చదువుతూన్నదింకా చదవండి...'

'బాగుందా... చదువుతాను... 'యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా విశన్తి నాశాయ సమృద్ధవేగాః తథైవ నాశాయ విశన్తి లోకాస్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః...' ఇది యిలా యెంత చదివినా, విన్నా బాగుంటుంది. కాని నువ్వేం చదువుకుంటున్నావు?'

'ఐదో ఫారం'

'ఇంత చిన్నవాడివిలా వున్నావే... అప్పుడే ఐదో ఫారం కొచ్చావా?'

'మరి మీరింత చిన్నవాళ్లు కదా...మీ కెన్నొచ్చాయో!' శాస్త్రి మందహాసం చేసేడు.

ఈ లోగా నోటి కడ్డంగా చెయ్యి పెట్టుకుని రైలులా కూతపెడుతూ ఆంజనేయులు మఠం

మెల్లెక్కి నా కోసం అటూ యిటూ పరికించి, నన్నా గదిలో చూసి, వొక్క గంతున లోన ప్రవేశించేడు. వాడికి కొత్త లేదు—నా కంటె వొక్క యేడాదే చిన్నైనప్పటికీ మూడు క్లాసులు తక్కువ. ఒస్తూనే గది అంతా కలయ చూసేడు. శాస్త్రి వేపు చూసి 'నా కొక్క పూదోత్తి యివ్వండీ' అని అడిగేడు.

'వీడు నా స్నేహితుడు—అంజనేయులు', పతంజలిశాస్త్రి నవ్వేడు — 'పేరు చెప్పక్కర లేకుండానే తెలుస్తూంది.'

అంజనేయులు శాస్త్రి వేపు తీవ్రంగా చూసి, పళ్లిగిలించి నవ్వి, రెండు కాళ్లూ యెగరేసి 'అశ్శభాస్ శ్శభాస్ బాగా పోల్చేసేవే...లబ్కులబా, లబ్కులబా, లబ్కులబా' అని గెంతులు వేసి, తిరిగి హేళనగా నవ్వుతూ పరుగుతీసేడు. శాస్త్రి వేపు నేను ఉదాసీనంగా చూసి 'పెంకె వెధవ' అన్నా వాడి తరఫున క్షమ వేడుకుంటూన్నట్టు. శాస్త్రి 'కాదు... వాడు మంచివాడే' అని బంతి పువ్వురంగు శాలువ పై మీద కప్పుకున్నాడు. 'జాగ్రత్తగా వుండవలసిన వాడివి నువ్వే. నువ్వు బాగుపడతావు'. నేనప్రయత్నంగా అన్నా 'ఉంటారా యిక్కడ కొన్నాళ్లు?'

'ఉందామనే వచ్చా' అంటూ అతడు నా కళ్లలోకి తీవ్రంగా చూసేడు.

మఠంలో ఆరాధన తక్కువగా వుండేది. పూజార్లు ఆ ఆవరణలోనే నివసిస్తూండేవారు. పిల్లల మందరం కూడి ప్రతి సాయంత్రం 'భజన' పేరిట యేవో పాటలు పాడే వాళ్లం. అంజనేయులు కన్నడ పాటలు అపశ్రుతిలో వెఱ్ఱి కేకలులా పాడే వాడు. అక్కడ వొక బొక్కి హార్మోనీ కూడా వుండేది.

ఆ వేళ సాయంత్రం నేను శ్రుతిలాగుతున్నాను అంజనేయులు 'తప్పాగళన్నునే నొప్పి కొల్లో మమ్మప్పకాయ బేకో తిమ్మప్ప నీవు' అని భయంకరంగా అరుస్తున్నాడు. మిగిలిన కుఱ్ఱకారంతా యెవరికి తోచిన లయలో వాళ్లు చప్పట్లు చరుస్తున్నారు. అప్పుడు శాస్త్రి నెమ్మదిగా వచ్చి అంజనేయులు మెడమీద చెయ్యి ఆనించి కూచున్నాడు. అంజనేయులు చుంచులా మెడ వంచి చిరునవ్వుతో పాట సాగనిచ్చేడు.

'అంజనేయులూ, బాగా పాడతావే!' మెడ మీది వేళ్లు బిగించేడు.

'ఉండండే, కోతలూ మీరూను'

'ఏం కోతలు?'

'వంకాయలు, గుమ్మడికాయలు...యిహి హిహి—' అంతా గొల్లున నవ్వేం...

'అలాక్కాదోయ్... చూడు... ఆ హార్మోనీ శబ్దం యెలా వుంది... అది శ్రుతి అంటారు.'

'సెప్పక్కర్లేదు'

'ఆ శ్రుతిలో నీగొంతు కలపాలి—మాట స్వచ్ఛంగా పలకాలి. అలా పాడితే స్వామికి ఆనందం కలుగుతుంది'

'లేకపోతే' అని కొంటె ప్రశ్న వేసేడు.

'చుట్టుప్రక్కలవాళ్లకి బాధగా వుంటుంది. చూడు... యిలా పాడాలి.'

శాస్త్రి హార్మోనీ శ్రుతిలో గొంతు 'ఆ' అని కలిపి ఆ పాట తిరిగి మృదువుగా, హాయిగా, భక్తిగా పాడి వినిపించేడు. మాకందరికీ ఒళ్లు పులకరించింది. పూజార్ల యింట్లో పనిచేసే 'పైడి' వచ్చి మండపంక్రింద బొమ్మలా నిలబడి పాట వింటూంది. దానిలో కూడా భక్తి వికసించింది కాబోలు.

'అబ్బాయిలూ, మనం అంతా కలిసి వొక బాలభక్త సమాజంగా తయారవుదాం. నెల కొకసారి రావిచెట్టుక్రింద వున్న ధర్మమండలివారి భజన పార్టీనికూడా పిలిచి, చక్కగా భజన చేస్తే, అంతా వచ్చి ఆనందిస్తారు. అప్పుడు మనం భజన యింకా సక్రమంగా చెయ్యొచ్చు. ఏమంటారు?'

మాకు చాలా సరదా వేసింది. అలాగే అన్నాం. కాని అంజనేయులే చిన్న సమస్య లేవదీసేడు. 'ఆ డబ్బు డవాలంతా చేరే వరకూ మనకేదైనా ప్రసాదాల యేర్పాటుందా లేక మన భజన మిరియాల దండుగకేనా?'

'ప్రసాదాలు కావలసినన్ని. అవన్నీ నేను చేయిస్తాను' ఆ మాట వినగానే అంజనేయులు అంజనేయస్వామిలా పొంగిపోయి, గభీమని లేచి గుండెలకు మోకాళ్లు తగిలేలా కుప్పి గంతులువేసి 'అశ్శభాస్ శ్శభాన్ బాగా సెప్పేవ్—లబ్బు లబా లబ్బు లబా' అని వెఱ్ఱి తాండవం చేసేడు. మంగళహారతి

ముగియగానే అంతా వెడిపోయేరు—నేనూ శాస్త్రి వెడుతూంటే పైడి మండపం చాటుకు మెల్లగా తప్పుకుంది.

పతంజలిశాస్త్రి మీద చుట్టుప్రక్కల పెద్దలందరికీ గౌరవభావం యేర్పడింది. ఆ కారణంవల్ల అతనిమీద నాకున్న గురుభావంవల్ల నేనతనితో అనునిత్యం వుండడం మా వాళ్లు హర్షించేరు. శాస్త్రి కూడా నన్ను శిష్యవాత్సల్యంతో చూస్తూ, నే నెప్పుడూ సక్రమ మార్గంలో నడిచేటట్లు చెయ్యడానికి ప్రయత్నించేవాడు. నేనూ వకుళం వొంటరిగా వున్న సమయాల్లో యేదో పని కలిపించి నన్నెక్కడికో పంపుతూండడంవల్ల వకుళానికి నా మీద కొంత అసహ్యం కలిగింది వకుళం మా పొరుగింటి ప్లీడరు గారి కూతురు—చురుకైనది—మంచి నెమ్మది కలిగినది—ఆ పిల్ల నాకు ప్రాణంకంటె యెక్కువ.

వకుళం ఆంజనేయులకు దూరపు బంధువు. వాడివల్లే నాకాపిల్లతో పరిచయం కలిగింది.

ఆవేళ సాయంత్రం ఐదు దాటిన వరకూ మఠం డాబామీద శాస్త్రి నేను కూచుని యేవో కబుర్లు చెప్పుకున్నాం. తరవాత శాస్త్రి సంధ్యా వందనానికి వెడిపోయేడు. పిల్లిలా చప్పుడు చెయ్యకుండా వకుళ వచ్చి నా వెనక నుంచుంది.

'ఏమి టాలోచిస్తున్నావు?' పరధ్యానంగా వున్న నేను తుళుక్కుపడ్డాను. వెనుదిరిగి ఆమెను చూడగానే నాకాశ్చర్యం వేసింది. ఆమెలో యేదో గొప్ప మార్పుగుపించింది. అప్పటికి సుమారు వారం రోజులనుంచి వకుళం నా కంట పడలేదు. ఆంజనేయులు నడిగితే, 'వకుళ మూన్నాళ్ళపాటు యెడంగా కూచుందిరా. యేవిటో—పెద్దమనిషైందనుకుంటున్నారు' అన్నాడు. నాకేమీ అర్థం కాలేదు. పెళ్లికాకుండా పెద్దమనిషెలా అయిందిగా అంటే వాడికీ బోధపడలేదు.

'ఏం వకుళా! వారంరోజులై యెక్కడా జూడలేదు!'

'వారం రోజులై నేను జూడలేదుగాని, నువ్వెన్నాళ్ళయి జూడలేదో గుర్తుందా? శాస్త్రి దగ్గర వైదికం నేర్చుకుంటున్నావా?'

'వైదికం నేర్చుకోడానికి మాకర్హత లేదట'

'అయితే మంత్రాలు నేర్చుకుంటున్నావా?'

నాకేం జబాబు చెప్పాలో తోచలేదు. ఆమెను చూస్తున్నకొద్దీ ఆమెలో యేదో తీవ్రమయిన మార్పు గోచరిస్తూంది. నిజంగా పెద్దమనిషయిందా? అంటే యేమిటి? నే నెప్పుడు పెద్దమనిషవుతాను? నాదండలు, హృదయభాగం చూసుకున్నా. ఇలా ఆలోచిస్తూంటే పడమటి దిక్కునుంచి అరుణారుణ కాంతుల్ని కబళిస్తూ వొక కారుమేఘం పరుగెత్తి వస్తూంది. రివటగాలి పెనుగాలిగా మారి వుధేత్తుగా టపటప చినుకులు పడసాగేయి. డాబామీద దక్షిణ దిక్కున దగ్గరగా వున్న గదిలోకి పరుగెత్తేం. వెంటనే ఆవాన పెద్దదై వుత్తరగదిలోకి మమ్మల్ని వెళ్లనివ్వలేదు. దక్షిణగది మెట్లు కూలిపోయివుండడం చేత అక్కడ మేం ఖైదయిపోయేం. ఎదురుగా కిటికీలోంచి వకుళయిల్లగుపిస్తూంది. ఆమె కిటికీ మూసింది.

'కిటికీ మూసేవేం?'

'చలిగాలి వీస్తోంది' ఆమె మందహాసం చేసింది.

'వకుళా! నీలో యేదో మార్పు కలిగింది. అది నాకర్థం అవడంలేదు. నాకు చెప్పవూ?' ఆమె సుదీర్ఘమైన కనురెప్పలు బరువుగా వాలేయి. ఎందుకో వాటిని చుంబించాలనిపించింది. హోరని వర్షపు శబ్దాన్ని చీల్చుకుని క్రింద మండపంమీంచి ఆంజనేయులు 'లబ్కులబా' వినిపిస్తూంది. నెమ్మదిగా వకుళాన్ని సమీపించి దగ్గరకు తీసుకున్నా. తటాలున ఆ పిల్ల నా హృదయంమీద రెండు చేతులూ అదిమి వెనక్కునెట్టి, ధారాపాతంగా కురుస్తూన్న ఆ వర్షంలో, డాబాపొడుగునా పరుగెత్తి ఉత్తర గదిలోంచి అదృశ్యం అయింది. ఆమె వెడిపోయిన ఐదునిమిషాల తరవాత 'గోపాలం' అని పతంజలి శాస్త్రి పిలుపు వినబడింది.

అతడు గంటసేపు నన్ను పృచ్ఛించిపృచ్ఛించి విషయం అంతా గ్రహించేడు. అమాయికంగా నా ఆరాటం అంతా అతనికి చెప్పేను. శాస్త్రి వుగ్రరూపం ధరించేడు. భగవద్గీత చేతిలో పట్టుగుని 'దీనిమీద చెయ్యివేసి ప్రమాణం చెయ్యి మళ్లీ అలాంటి పొరబాటు చెయ్యనని' అని గసాయించేడు — బైట వర్షం పడుతూన్నట్టు నాకళ్లంట అశ్రువులు జలజల రాలేయి. ప్రమాణం చేసేను. గీత చేతిలో వుంది. అది అతని చేతిలో

కూడా వుంది. ప్రమాణవాక్యం నానోటిలో ధ్వనించింది. అతని హృదయంలోనో!

ఆ నిముషంనుంచీ కొంతకాలం నా మనసు బాధపడింది. అనుభవహీనుడిని. అజ్ఞానం నన్నలా తప్పుత్రోవలోకి నెట్టివేస్తూంది. తరవాత నాలుగైదు రోజులవరకూ వకుళంతో మాట్లాడలేకపోయేను. ఆమెకూడా నాతో మాట్టాడాలన్న అభిలాష అంతగా చూపలేదు.

ఒకనాడు సాయంత్రం మసక వెన్నెలలో నేనొంటరిగా పొగడచెట్టుక్రిందకూచుని, వర్షంనాటి సాయంత్రం జరిగిన సంఘటన నెమరువేసుకుంటున్నా. ఆంజనేయులు వెనకచాటునే వచ్చి కళ్లు మూసేశు. నేను విదిలించుకున్నా.

'ఏమాలోచిస్తున్నావురా?'

'ఏం లేదు'

'నాకు తెలుసు'

'ఏమిటి?'

'వకుళం—'

'ఎవరన్నారు?'

'నాకు తెలుసు. వకుళం అందంగా వుంటుందిరా. కాని నన్ను చూస్తే దానికి వెక్కిరించాలని వుంటుంది. నువ్వంటే దానికి చాలా సరదా.'

'ఎప్పుడు చెప్పింది'

'ఇందాకా—వాళ్ళనాన్నగారి కెవరో పూతరేకు లిచ్చారట—నీ కిమ్మని యిచ్చింది.' జేబులోంచి ఆకుమడత తీసేడు. దానిలో రెండు పూతరేకులున్నాయి.

'నీకిచ్చిందా?'

'లేదు. దొంగ... కాని జాగ్రతరోయ్... వాళ్ల నాన్నకి తెలిస్తే వీపు యిస్త్రీ అయిపోతుం దిద్దరికీ'

'ఏమిటి తెలిస్తే—పూతరేకు యిచ్చిందనా?'

'నాకూ చే... యెరగవ్. కాని వోరేయ్. నాకు రోజూయేదైనా నైవేద్యంపెడితే నీకు మంచి సాయం చేస్తా.' నా మనస్సు వికసించింది. ఒక పూతరేకు వాడి కిస్తూ అన్నా 'పోనీరా—నువ్వంతా యెగతాళి చేస్తావూ. నా కలాంటి వుద్దేశమే లేదు.'

'దాని కుంటేనో'

'అబ్బే'

'అలా కాదు'

'నిజం!'

'అశ్శభాస్ శ్శభాస్—యేమీ యెరగవు—లబ్కు లబా, లబ్కు లబా' రెండో పూతరేకు కూడా వాడి కిచ్చేను అప్రయత్నంగా. నాట్యంచేస్తూ పరుగెత్తేడు. మళ్లీ నిశ్శబ్దం—ఒంటెబాటు. వకుళం పెద్ద మనిషైంది. నే నింకా కాలేదు—అయేవరకూ వేచి వుండాలి కామోసు. ఈ అగమ్యగోచరపు లోకంలో వున్న నన్ను 'బాబూ' అన్న పిలుపు మేలుకొలిపింది. వెనుదిరిగి చూసేను. పైడి! అది నన్ను రమ్మంటోంది. ఎవరో పిలిచేరట. యంత్రంలా దానివెంట వెడుతున్నా.

చుట్టు తిరిగి మఠంవెనక వున్న చెరువుగట్టు మీంచి సుమారు మఠం పెరటివరకూ వచ్చేను. పైడి ముందు దారితీస్తూంది. చెరువు నానుకొని దిబ్బ—ఆ దిబ్బ యెక్కితే పాడైన మెట్లవరస. అక్కడి తలుపు లెప్పుడూ మూసివుంటాయి. కాని అప్పుడవి తెరచి వున్నాయి. తూర్పునుంచి వుదయేందుకిరణాలు సూటిగా గదిలో పడుతున్నాయి.

ఆ మెట్లు నే నెన్నడూ యెక్కలేదు. వాటి కిరుప్రక్కలా గడ్డి మొలిచి వుంటుంది. చెరువుగట్టు మీంచి అక్కడకు చేరడానికి సరైనమార్గం లేదు. పైగా ఆ పెరటింటికెదురుగా చెరువుగట్టుగోడ నానుకొని వొక పెద్ద రావిచెట్టుంది. మఠంలో నిర్భాగ్యురాలైన వొక వితంతువు సిగ్గు భరించలేక ఆత్మహత్య చేసుకోవడంచేత దయ్యమై ఆ చెట్టును పట్టివుందని పుకారు. అంచేత ఆ వెంపు వెళ్ళేవాళ్లం కాము. మెట్లమీద పాకుడు కూడా వుంది.

మీద మెట్టెక్కి వెనక్కి తిరిగి చూసేసరికి పైడి తిరోగమిస్తూంది. కారణం ఆలోచిస్తూండగా మేడ బొక్కి గదిలోంచి ఖణేలుమని గాజులచప్పుడు వినపడింది కుశిమూలనుంచి హటాత్తుగా వొక కోమలాంగి వచ్చి, నా వేపుచూసి 'ఓహో వచ్చావా' అన్నట్టు మందహాసం చేసింది. ఆమెను చాలాసార్లు చూసేను. కాని ఆ లావణ్యంతో యెన్నడూ చూడలేదు. వెన్నెల చుంబించిన ఆమె పలువరసనుంచి ప్రసారితమైన కాంతులు నా కళ్లకు మిరుమిట్లుగొల్పేయి. ఆమె డాక్టరు అయ్యంగారి కూతురు—బాలవితంతువు— పేరు అలిమేలు.

'నీ పేరేమిటి?' నేను చెప్పేను.

'గోపాల కృష్ణుడివా?' తమాషాగా నవ్వింది. అది కొంటెగానే వుంది. కాని దానిలో వొకవిధమైన జాలి వుంది. దానిలోనే యేదో కాంక్షని సూచించే ధ్వనివుంది. అది జాలిగొలిపే యేదో విజ్ఞాపనపత్రంలో ముందు వ్రాసే విషయసూక్ష్మంలా వుంది.

బూజులు పట్టి, గోడపెళ్లలు రాలిపోయిన ఆ పాడుగదిలో, వెన్నెలవెలుగులో, ఆమె యేవో ప్రశ్నలు వేస్తూంది కాని, ఆమె మాటలు నాకు వినిపించడంలేదు. నేనేవో జవాబులు చెపుతూంటే ఆమె ముసిముసి నవ్వులు నవ్వుకుంటూంది. తెలుగు పలుకులమధ్య ఆమె అరవయాస వింతైన కమ్మదనం కలిగివుంది.

'అతను—నీతో తిరుగుతూంటారు, ఎఱ్ఱగా—ఆయన పేరేమి?'

ఈ ప్రశ్నతో నాకు తెలివివచ్చింది. అప్రయత్నంగా 'పతంజలిశాస్త్రి' అన్నా. వెంటనే ఆమె మాటలు నేర్చుకుంటూన్న చిలుక క్రొత్తమాట వినగానే దానిని లోలోపలే నాలుకత్రిప్పుతూ పురశ్చరించినట్టు 'పతంజలిశాస్త్రి' అని రెండుమూడు సార్లు గొణిగింది.

'ఆయనకు యీ చీటీయిస్తావూ?'

హారేరామ్! నా గుండెలలో రైళ్లు గుద్దుకున్నాయి.

'పతంజలి శాస్త్రి అంటే యెవరనుకున్నారు? అతడొక మహాగ్ని జ్వాల!'

'ఈ చీటిలో అతడిని తిట్టుతూ వ్రాయలేదే!' ఆమె బెట్టుగా అంది—కాని నవ్వుతూనే.

'పొగుడుతూ వ్రాసినా, వ్రాసిన మిమ్మల్నీ, అందిచ్చిన నన్నూ మసి చేస్తాడు.'

'ఫరవాలేదు ఇవ్వకూడదా' చీటీ అందిస్తూ జాలిగా పలికిన యీ వాక్యంలో వుక్రోషం అగుపించింది. చీటి తీసుకువెళ్లి యివ్వడానికి ధైర్యంకలగ లేదుగాని, ఆమెకు ఆశాభంగం కలిగించడంలో హింసగోచరించింది. సరే యిమ్మన్నా. చీటియిచ్చినా చెయ్యి పట్టుకుని 'ఎవ్వరికీ చూపించకూ—'అంది.

చెరువుగట్టుకు దిగి వెనుతిరిగి చూసేను. ఆమె గది గుమ్మంముందు నుంచుని చూస్తూంది నావెంపు. చందమామె ఆమె సౌందర్యాన్ని త్రాగేస్తున్నాడు. ఆ జ్యోత్స్నావికాసంలో ఆమె అరబ్బీరాత్రుల కథలలో యే దేవకన్యకో అనిపిస్తూంది.

చీటి పట్టుకెళుతున్నానన్న మాటేగాని అది అందివ్వడానికిగుండెలు లేవు. కుంటెనకారుడి కుండే సాహసం నాలో మృగ్యం. సందు మలుపు దగ్గర అయ్యంగారి మేడముందు పెద్దనీడ యేర్పడింది. ఆ నీడ చేరగానే పైడి సన్నని అవరుద్ధ కంఠం వినిపించింది. 'ఏటున్నారు బాబూ.' నేను సంగతి చెప్పేను. 'నా నిచ్చేస్తాను బాబూ, తెండి' ఆకీ నీడలో దాని మత్తిలోచనాలు మెరిసేయి. నా తల మీంచి పర్వతం దింపినట్టయింది.

నేను పిల్లిలా మా గుమ్మంముందు నిలబడి పైడి శాస్త్రిగదిలోకి వెళ్లడం, ఐదు నిమిషాల తరవాత తిరిగి రావడం చూశా. అది తిరిగి అయ్యంగారింటికి ప్రదక్షిణం చెయ్యడానికి గామోసు బయల్దేరింది. నేను బిక్కుబిక్కుగా దానిని సమీపించి అడిగా—

'ఏమయింది?'

'సీటిచ్చేరు'

'నే నిస్తాతే'

'నేదు బాబూ. నేనే యిస్తా'

'అక్కర్లేదు—నేనే యిస్తా'

'మీ నాన్నగోరితే సెప్పనా?'

నా గొంతుక తడి ఆరిపోయింది. దాని కెందుకంత కోపం! అది దూరం అవుతూన్నకొద్దీ దాని తెల్లచీర వొక మచ్చలా మారుతూండా వెన్నెలలో. అది అయ్యంగారింటి పెరటివేపు వెళ్లడం లేదు—మలుపుదగ్గరున్న పెద్ద రావిచెట్టు నీడలో కొంచెం ఆగి తిరిగి బయల్దేరింది. నాకు అనుమానం వేసింది, అది తిన్నగా వెళిపోతూంటే. నన్ను నేను మరిచిపోయి అలా నిలబడ్డపాళంగా, ఆంజనేయులు నా కెదురుగా వచ్చేడు. వాడి నొసట విభూతిరేఖలు నడుమ సిందూరం మెరుస్తూంది.

'ఏమిగోయ్! అలా నిలబడి నిద్రపోతున్నావు!'

'అలాగేరా...ఎక్కడనుంచి వస్తున్నావు'?

'నా కోవెలనుంచి...యింద ప్రసాదం.'

'కాని నువ్విలా వస్తూన్నప్పుడు ఆ రావిచెట్టు క్రింద యెవరున్నారురా?'

'ఏం ? మన పైడి'

'ఏం చేస్తూంది'

'ఏదో కాగితం చింపినట్టుంది'

'పద చూదాం'

వెళ్లి అక్కడ వెతికితే నాలుగు చిన్న కాగితం ముక్కలు దొరికేయి. ఎదురుగుండా వున్న కిల్లీకొట్టు దీపంవద్ద అవి దగ్గరచేసి చూసేం. అది అలిమేలు శాస్త్రికి వ్రాసినలేఖ. నా కత్యాశ్చర్యం కలిగింది. ఆంజనేయులు పళ్లికిలించి గెంత నారంభించేడు, 'లబ్బుక్కు లబా'

ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. పతంజలిశాస్త్రి మండిపడిపోయి వుంటాడు. కొంపతీసినా ప్రమేయం తెచ్చిందేమో పైడి. రేపు శాస్త్రిముఖం యెలా చూడడం. ఈ ఆలోచనలతో మూడుఝాములు దాటినవరకూ కునుకురాలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. కాని హటాత్తుగా మఠంముందుమ్రోగిన భేరీ భాంకారాలతో తెలివివచ్చింది.

ఉడిపినుంచి మధ్వస్వాములవారు శిష్య గణంతో, హయంపటాటోపంతోవచ్చి తెల్లవారు ఝామునే మఠంలో దిగేరు. ఆ నిముషంనుంచీ మఠం వచ్చీపోయే జనంతో, పూజావిధానాలతో, పండితగోష్ఠితో మార్మ్రోగింది. ముఖ్యంగా పిల్లలకు రెండు విశేషాలు ఆహ్లాదం కలిగించేయి. ఒకటి స్వాములవారి సన్నాయిమేళం, నగారా—రెండు రూపయౌవన ఉపాసనాభూసురుడైన స్వామి—ఆ మహాపండితుడు పిల్లలమధ్య యిట్టే పసిపిల్లవాడిగా మారిపోయేవాడు.

ఈకోలాహలంలో పతంజలిశాస్త్రి దృష్టి నుండి తప్పించుకోవడం నాకు సులువైంది. అతడు దూరంనుండి నావేపు చూచినప్పుడల్లా నాగుండెలు టువ్వుటువ్వుమనేవి. కాని అతని ముఖంలో నాకేమీ మార్పు అగుపించలేదు. పైడి వొకవేళ నాప్రమేయం తేలేదేమో!

సాయంత్రం ఐదుగంటలకు మఠంవెనక తూర్పు వరండామీద పిల్లలంతా చేరి గోలపెడుతున్నారు. ఎదురుగుండా అరుగుమీద వకుళ అమాయకంగా నిలబడి పిల్లల ఆట చూస్తూంది. ఒక్కొక్కప్పుడా పిల్లను తల్లిచేసుకొని దొంగాటాడుతున్నారు. నేనూ ఆంజనేయులు అటువేపు వెళ్ళేం. నన్ను చూడగానే వకుళం చిరునవ్వు నవ్వింది. ఆమె కనురెప్పలమీద పూర్వకోప చిహ్నాలేమైనా వున్నాయేమో అని అనుమానంవేసింది. ఆమె మందహాసంలో 'పోకిరీ వాడా' అని నన్ను తూలనాడే భువకిణాంకం మసక మసకగా గోచరించింది. ఆంజనేయులు 'వెళ్లిరా' అని నన్ను పొడిచేడు. వాడికి మాయిద్దరినీ బాగా తెలుసు—వాడికి వకుళం నాన్నంటే హడలు.

కాని నేనూ వకుళం యెక్కడుంటే పిల్లలంతా అక్కడే చేరుతున్నారు. గోల చేస్తున్నారు. ఒకటి రెండుసార్లు పెరటిలోకి వెళ్లడానికి ప్రయత్నించేం.—కాని ఆ వానరమూక అంతా వెంటపడ జొచ్చింది.

ఇంతలో, ఆంజనేయులు కళ్లింతలు చేసి, చేతులు త్రిప్పుతూ—సౌంస్కృతం పోలిన యేవో నోటితడాకాలు వాగుతూ, 'నేను ముద్రధారణ స్వాములవారిని— రండి— మీ కందరికి ముద్దర్లు వేస్తాను' అని వొక్కొక్కరినీ పిలిచి జబ్బగిల్లులు ప్రసాదించసాగేడు. గిల్లు తిన్నవాడు మొర్రో అంటే మిగిలినవాళ్లంతా గొల్లున నవ్వుతున్నారు. మే మిద్దరం బాదంచెట్టు పెరటిలోకి దారితీసేం.

ఎండిన బాదమాకులు మా కాళ్లకిందపడి పళపళ శబ్దిస్తున్నాయి. పడమటి సూర్యుడి రక్తకిరణాలు పూర్వాకాశంమీద పొర్లుతున్నాయి. చెరువునీరు షర్బత్ లా మెరుస్తూంది.

మేం దిబ్బయెక్కి గన్నేరుచెట్లనడుమ బొద్దుగా చేరిన యెండు పండుబాదమాకుల దిండుమీద కూచున్నాం. దూరంగా మఠంలోంచి ఆంజనేయుల ప్రతాపం వినిపిస్తూంది. మేమున్నస్థలం రహస్యంగా వుంది. చెట్టుమీద, చెరువులోను, పిట్టల అరుపులు, తొగరుపూల గమగమలు, తల దిమ్మెక్కిస్తున్నాయి.

'వకుళం! కోపం వచ్చిందా?'

'ఎందుకూ?' ఆమె నావేపు జాలిగా చూసింది.

'ఆవేళ...' ఆమె కోపం లేదన్నట్టు నవ్విన విధానం చూస్తే, ఆవేళ తడుస్తూ వర్షంలోపారి

పోవడానికి విశేషమయిన కారణం లేదని, కేవలం గాభరాపడ్డ మేనని తెలుసుకోగలిగేను.

ఆపిల్ల కోలకళ్లు, బిగుతైన పెదవులు, చిక్కుడు కాయలవంటి వ్రేళ్లు, పండు తమల పాకులవంటి పాదాలు, నాలో సాహసాన్ని రేకెత్తేయి. స్పర్శకు ఆమె వణకిపోయింది. కళ్లంట జలజల ముత్యాలు రాలిపోయేయి. నా నోటిలోంచి వెలువడ్డ నిట్టూర్పుల వేడికి తల్లడిలిపోయింది కామోసు, బాదమాకుల దిండుమీద వాలిపోయింది. పడమటికేసి అప్పుడే వుదయించిన వొకతార తెగి మహావేగంతో రాలిపోయింది.

వకుళం యేడుస్తూ వెడిపోబోయింది. నేనా పిల్లని సాధ్యమైనంతవరకూ, పంకిలహృదయానికి కలిగే బెదురుపాటువల్ల రుద్ధకంఠంతో వోదార్చడానికి ప్రయత్నించేను. కాని అది కళ్లు కాసిపోయేలా యేడిచింది. ఆ పిల్ల వెడిపోయింది. ఎంత పాపం చేసేను! అజ్ఞానంవల్ల చేసిన యీ కృత్యంతో నా జీవితాన్ని కళంకితం చేసుకుని, వకుళహృదయంలో చిచ్చు రగిల్చేను. అది నన్ను క్షమిస్తుందా? అగ్నిహోత్రం వంటి పతంజలి శాస్త్రి చేతిలో చెయ్యి వేసి చేసిన ఘోరప్రమాణాన్ని భంగపరచి, సత్యాన్ని, వ్రతాన్ని, ఆ మహనీయుడి వద్ద శిష్యరికాన్ని నవ్వులపాలుచేసేను. నేను క్షమకర్హుడినా! వికల హృదయంతో మండపం యెక్కుతూంటే నా వేపు చూసి ఆంజనేయులు కొంటెగా నవ్వుతూ యెగిరి 'లబ్కులబా' నృత్యం చేసేడు. ఈ అత్యాచారానికి అవకాశం కల్పించిన వాడి పీక నులిపివెయ్యాలనిపించింది.

ఆరాత్రి పండితగోష్ఠి జరుగుతూంది. నేనొక స్తంభంచాటున నక్కి కూచున్నాను. జగన్మిథ్యాతత్వాన్ని, ఆత్మపరమాత్మల అవినాభావవాదాన్ని ఖండిస్తూ స్వామి సంస్కృతంలో వుపన్యసించేరు. ఎవరో పండితుడు వారి వాక్యాల్ని తెలుగులో చెప్పేరు. పతంజలిశాస్త్రి మెరుపుతీగలా రంగంలోకి దూకేడు. అపరశంకరుడివలె మెరిసిపోతూన్న అతని మూర్తి ప్రభకు, ఝరీప్రతిచ్ఛన్నమైన ఆ దేవభాషావైదగ్ధ్యానికి అంతా మంత్రముగ్ధులయేరు. కాని అతనిమీద ప్రత్యేకంగా రెండుకళ్లు నిలచిపోయి, అతడిని త్రాగేస్తూన్నట్టు కనిపెట్టేను. అవి అలిమేలువి. ఆమె అప్పుడప్పుడు నాకేసికూడా చూసి మునిమునినవ్వులు నవ్వింది. అక్కడకు రావడానికి కామెకున్న ధైర్యానికి, ఆ ధగధగ మెరిసే కుంకుమ ధరించిన సాహసానికి నే నాశ్చర్యపోయేను.

సభముగియగానే అంతా కోలాహలంగా వెడిపోతున్నారు. అలిమేలు నా ప్రక్కగా వచ్చి చెవిలో 'రేపుదయం పదిగంటలకు—అక్కడికే' అని వూదింది.

మర్నాడుదయం నిర్ణీతసమయాని కా శిథిలమైనగది చేరేను. కాని అలిమేలింకా రాలేదు. నా మనస్తత్వంలో వొక విధమైన పరివర్తన ఆ తొలినాటి సాయంత్రంనుండీ కలిగింది. అంచేతే కామోసు, తరవాత అలిమేలు తీగ కదలినట్టు వస్తూంటే, యిలాటి దివ్యవిగ్రహం వలచివస్తే కాదనే ప్రవరాఖ్యుడుంటాడా అనిపించింది. ఆమె వస్తూనే చిరునవ్వుతో 'చీటీయిచ్చేవా' అంది. నేను నసిగేను. ఆమె కళ్లు కొంచెం జేవురించేయి. నాకు భయమేసింది.

'ఇవ్వలేదా?'

'నే నివ్వలేదు'

'మరి అదేంచేసేవు?' ఎవరికైనా చూపేవా?'

జీవితంలో మధుర రహస్యం గుర్తెరిగినన్నామె తన (ఒక వేళవుంటే) అయిదేళ్ళ తమ్ముడిగా భావిస్తూంది.

'నేను స్వయంగా యివ్వలేకపోయేను. పైడి ద్వారా పంపేను'

'పైడిద్వారా...! చెడ్డపని చేసేవు!!' తీవ్ర రూపం ధరించింది. కాని మరునిమిషంలో ఆమె మందహాసం చేసి అంది, 'పోనీ! భయంలేదు. ఇది... యీవుత్తరం యిస్తావా?'

హరేరాం! నన్నీ కామినీపిశాచి వదిలేలా లేదు. కాని ఆమెమాటతోసివెయ్యలేకపోయేను. ఉత్తరం అందిస్తూ ఆమె నాయెడమచేతివ్రేళ్ళనీ తన రెండుచేతులతో అదిమి, 'చూడు! నేను శాస్త్రిగారిని యెంతో ప్రేమిస్తున్నాను. ఆయనకోసం నా హృదయం దహించుకుపోతూంది. నువ్వాయనతో యెప్పుడూ తిరుగుతుంటావు. అంచేత నువ్వుసహాయం చెయ్యాలి. చేస్తావుకదూ— నేను తిరిగి నీకేమీ వుప

కారం చెయ్యలేను. కాని బ్రతికినంతకాలం నీకు మిక్కిలి కృతజ్ఞతతో వుంటాను,' అంది.

ఆమె వాక్యాలు నాలో కరుణ రసాన్ని తరగలెత్తేయి. చీటి తీసుకుని బయలుదేరా. కాని వీధిలోకి రాగానే హటాత్తుగా భయం వేసింది. నేనే... శాస్త్రికి యిది యివ్వడమే...అసంభవం! తిరిగి నా మెదడు గానుగలో చెరుకుగడలా నలిగిపోజొచ్చింది.

ఎదురుగా ఆంజనేయులు వస్తున్నాడు. గబగబ చీటీ పంట్లాంజేబులో దాచేను. కాని వాడి కళ్లు డేగ కళ్లు!

'ఏమిట్రా జేబులో దాచుకుంటున్నావు? పూతరేకులా వుంది!' వాడి కెప్పుడూ తిండి గోలే.

'కాదురా—ఇప్పుడో చిక్కు వచ్చింది. చాలా రహస్యంగా వుంచాలి సంగతి—' విషయం అంతా చెప్పేను. వాడు చెవులు రిక్కించి, పళ్లికిలించి విన్నాడు—

'అలిమేలే! వారేవా—మనశాస్త్రినే! గోడల మీద వ్రాసేద్దాంరా వీళ్ల పేర్లు?' వాడిని కొట్టిన చెంపకాయకి నా చెయ్యి కందిపోయింది. కానివాడు తడుముకుని దులిపి వేసేడు

'నువ్విస్తావా శాస్త్రికి?'

రెండో చెంప తడుముకుని, 'ఏం—యిది ఖాళీగా వుండిపోయిందనా?' అన్నాడు.

'మరెలాగా?'

ఒక్క చిటిక వేసేడు, 'పోస్టు చేద్దాం'

'దేవాంతకుడివిరా అంజీ!

'అ శ్శభాస్ శ్శభాన్, లబ్బు లబా...'

'ఆగరా—ఆగరా—ఈచీటీమీని అలిమేలు తన యెడ్రసు వ్రాయలేదు. మరి శాస్త్రి ఆమెకెలా జవాబు వ్రాయగలడు, వొకవేళ వ్రాయాలనే వుంటే?

'గట్టిచిక్కే...నువ్వు వ్రాసేయరాదూ!'

'నావ్రాత శాస్త్రి పోల్చేస్తాడురా - నువ్వు వ్రాయి'

'చిలకతంతే?'

అంతపనీ జరిగింది. పతంజలిశాస్త్రి ఆ చీటీలోని ఆంజనేయులు లోటిపిట వ్రాతపోల్చేడు—వాడిని తనగదిలోకి తీసుకవెళ్లి నాలుగుచెంప కాయలు లాగి, కట్టుపుచ్చుకునేసరికి వాడు సంగతి అంతా తుచ తప్పకుండా చెప్పి వేసేడు. శాస్త్రి నన్ను పిల్చి పడచివాట్లు వేసేడు, 'చెడిపోవడానికి యిష్టంగా వుందా? మీ వాళ్లతో చెప్పనా? తెలివైనవాడివి, బాగుపడతావని, నీ మీద యింత శ్రద్ధతీసుకుంటున్నా—నువ్విలా సంచరిస్తే, నాతో తిరుగుతూండడంచేత నాకు అపఖ్యాతి వస్తుంది. ఈ అలిమేలు మ్లేచ్ఛురాలు—దానివద్దకు నువ్వెందుకు వెళ్ళేవు? ఇక ఎన్నడూ వెళ్ళవద్దు—తెలిసిందా? ఓయ్ ఆంజనేయులూ, మళ్ళీ యిలాంటి సలహా యిచ్చేవా, నీ తోక తెగగోస్తా' ఆంజనేయులు లేచి వెక్కిరిస్తూ పారిపోయేడు. నేనుమాత్రం బరువుగా కాళ్లీడ్చుకుంటూ వెళిపోయేను.

నేను వారంరోజులవరకూ ఎవరితోనూ మాట్లాడలేదు. మఠంలో కాలు పెట్టలేదు. వకుళాన్ని రెండుమూడుసార్లు దూరం నుంచే తప్పించుకొన్నా. ఆపిల్ల పిల్చింది కూడా. నేను లెక్క చెయ్యలేదు.

కాని ఆవేళ నేనొంటరిగా పొగడచెట్టుప్రక్క అరుగుమీద కూచున్నాను. ఎండ తీక్ష్ణంగా వుంది. వకుళం వెనకబాటుగా వచ్చి నా మెడమీద వూదింది. నేను వెనక్కు తిరిగేను. ఆమె నవ్వింది.

నేను దిగులుగా అడిగేను 'నామీద కోపం వచ్చిందా?'

ఇది ప్రేమికుడు అనునిత్యం ఎన్నో సందర్భాలలో వేసే పిచ్చిప్రశ్న. లేదని జవాబు రావాలని కోరివేసే ప్రశ్న యిదొక్కటే ప్రేమ విపణిలో. ఈప్రశ్నే నేనిదివరకామె కెన్నిసార్లో వేసేను. అప్పుడామె దానిని గ్రహించే పరిస్థితిలో లేదు—నేడో—సంగతి తారుమారైంది. ఆమె చెరచెరనడిచి మేడ మెట్లెక్కుతూ సగంలో ఆగి, పిట్టగోడ మీద గడ్డం ఆనించి, మెరిసే నేత్రాలతో, బుంగమూతితో 'రా' అంది. అది మా ద్వితీయ సమాగమం—అద్వితీయ సమాగమం.

తరవాత గాలికోసం కిటికీ తలుపులు తెరచి నేను కొంచెం వేదాంతం బోధపరిచేను.

'క్షణికమైన యీ సౌఖ్యంకోసం పవిత్రమైన శీలాన్ని ధ్వంసం చెయ్యడం అజ్ఞానం!

'క్షణికమైనదైనా ఆనందం, ఆనందం కాదా? అనుభవించరాదా? ఓహో—శాస్త్రిగారి వేదాంతం కాస్త నీకు కూడా పట్టిందే' అమెను చూస్తుంటే నా కాశ్చర్యం వేసింది. 'సత్ప్రవర్తనకి చాలా వ్యవధి కావాలి దుష్ప్రవర్తన యిట్టే కలుగుతుంది'

'అదిగో తిరిగి వేదాంతమే చెపుతున్నావు. ఈ ఆచారాలు, కట్టుబాట్లు ప్రచారం చేసే పెద్దమనుషులే చివరకు యెంతో అనాచారాలకి దిగిపోతారు.'

'నిప్పుకు చెదపట్టొచ్చు. కాని శాస్త్రిగారు మహాగ్నిజ్వాల తెలుసా!'

అదే సమయానికి శాస్త్రి అక్కడ ప్రత్యక్షమయేడు. వకుళం గబగబ సర్దుకుని, తలవంచుకుని వెడిపోయింది. నాకు తలకొట్టి నేలమీద పడవేసినట్టయింది. అతడి కళ్ళలోకి చూడలేకపోయేను. అతని పాదాలమీద పడి క్షమించమని ప్రార్థిద్దామనుకున్నా. కాని పెదవులైనా కదపడానికి శక్తిలేకపోయింది. అది క్షమించే సందర్భం కాదని, నా నేరం క్షమించరానిదని నాకే తోచింది. కాని నా అభిప్రాయం తప్పని వెంటనే అతడు రుజువు చేసేడు. 'నువ్వు వున్నతస్థితికివస్తావని, సాధారణంగా నీయీడువాళ్ళందరికన్నా శతాధికంగా తెలివిగలవాడివని, నిన్నింత కనిపెడుతున్నా. కాని దురదృష్టవశాత్తూ నువ్వే నీజీవితాన్ని ధ్వంసం చేసుకుంటున్నావు. ఉన్నతపదవి అలంకరించే రేఖలు నీ హస్తంలో ప్రకాశిస్తున్నాయి. ప్రజాబాహుళ్యాన్ని నీవెనక త్రిప్పుకొనే లక్షణాలు నీలో వున్నాయి. కాని పడిపోవడానికి దోహదం చేసే దుష్టరేఖకూడా పగనొన్న త్రాచులా బుసలుకొడుతూంది. దాని కాటునుంచి నిన్ను తప్పించిడానికే నా తాపత్రయం అంతా. నువ్వు పెద్దయేకా సర్వసామాన్యజీవిగా వుండడం నేను చూడలేను. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని సన్మార్గంలోకిరా!'

అతడి వాక్ప్రవంతి బీడుజేరిన నా విశాలమనో భూమిమీంచి ప్రవహించి, దానిని పవిత్రీకరించి సారవంతం చేస్తుందనిపించింది. అతనివుపదేశ బీజాలు దానిమీదపడి మొలకెత్తి మహావృక్షంగా పెరిగి, రసవంతమైన ఫలాలిస్తూన్నట్టయింది. అవనత వదనంతో, సిగ్గుచేత కృంగిపోయిన మనస్సుతో—పశ్చాత్తాపంతో కుతకుతలాడుతూన్న హృదయంతో, వెడిపోయేను.

సుమారు వారంరోజుల తరువాత వొకనాడు పైడినావద్దకు వచ్చి రాత్రిపదంటికి అగది దగ్గరకు రమ్మని అలిమేలు చెప్పిందని చెప్పింది. నాకు వెళ్లాలని లేదు కాని ఆమెకే కబురూ చెప్పకపోవడం న్యాయం కాదనిపించింది. పదిగంటలకు వెళ్ళేసరికామె అక్కడేవుంది. నేను వెడుతూనే క్షమార్పణతో ఆరంభించేను. తన వుత్తరంగురించి అడిగింది. అంతా పూసగుచ్చినట్టు చెప్పేను. ఆమె నవ్వింది.

'నువ్వింత పిరికివనుకో లేదు'

'పిరికి నే—అతని విషయంలో యెవ్వరైనా అంతే. అతనెవరో నీకు తెలీదుకనక'—

'సకమహర్షా?'

'అంతే'

'పిచ్చివాడా—నీక నుభవం లేదు—ధైర్యం లేదు—నీడంబాలన్నీ వొక చెంపకొడితే పాలు, వొకచెంప కొడితే నీరు కారే వకుళం దగ్గరే! నా కాశ్చర్యం కలిగింది. 'నీకు వకుళాన్ని తెలుసా?'

'జానికమ్మగారి కూతురు వకుళాన్నీ తెలుసు—నిన్నూ తెలుసు—బాదం చెట్టు పెరడూ తెలుసు'. నాకు సిగ్గువేసింది.

'అలా చూడు' నా వెనకనే వుంది కిటికీ—దాని లోంచి సూటిగా మఠం బాదం చెట్టు పెరడగుపిస్తూంది. గన్నేరుచెట్లు, వాటినడుమ బాదమాకుల దిండ్లు—అంతా. నన్నా మెయేవో చిక్కు ప్రశ్నలు, తర్క ప్రశ్నలు వేస్తూన్నట్టు, నేను వాటికి జవాబు చెప్పలేక తికమకలౌతూన్నట్టు, రెండు నిమిషాలు నాలో వూహించుకొని అతలాకుతలం అయిపోయేను.

'క్షమించు, ఏమైనా నేనా విషయంలో పట్టి పిరికిపందనే'

'పరవాలేదు. నీవంటి పిరికివాళ్లు చాలా మంది వున్నారు. కాని, యిది—యీ వుత్తరం అందజెయ్యి' ఆమె నన్ను అయ్యవారిలా గదమాయిస్తూంది. నాచాతకాని తనం వల్ల విచారం, శాస్త్రిని తల్చుకుని భయం, అలిమేలు దివ్యసౌంద

ర్యానికి పరవశం కలిగి నేను స్వప్నలోకంలో తేలిపోతూన్నాను. నాముందు ఆమె చెయ్యివొక కాలసర్పిణివలె, ఆ చేతిలో చీటి ఆసర్పిణి నాలుక వలె అగుపిస్తున్నాయి. నేను మాట్లాడలేదు కాని జాలిగా కళ్లు ఆమె వేపు త్రిప్పేను.

'నువ్వు స్వయంగా యివ్వక్కర లేదోయ్. ఆయనగదిలో దొరికేటట్లు పడేయి, చాల్ను' నేనా చీటీపట్టుగుని ఓడిపోయిన సైనికుడిలా బైటపడ్డాను. 'ఛా ఛా' అలిమేలు అంతా చూసింది. పీకదీసినపని' అనుకొంటూ ఆ చీటీచూడగానే నా గుండె గుభేలు మంది. ఆమర్నాడు రాత్రి పన్నెండు గంటలకు తనుగదికి వస్తున్నానని, అతనిపాదాలకు తన యౌవన సౌందర్యాలు అంకితం చేసేనని, ఆదరించినా కూలదన్నినా తనభాగ్యమేనని, ఎక్కడికీ వెడిపోకుండా గదిలో వుండమని ప్రార్థిస్తూ శాస్త్రికి వ్రాసింది. దేవాంతకురాలు !!

మర్నాడు అర్థరాత్రి బైటికివచ్చా. వీధి నిర్మానుష్యంగా వుంది. గాఢాంధకారంగా వుంది. శాస్త్రిగదిలో లైటు వెలుగుతూంది. తలుపు ఓరోకలిగావుంది. శాస్త్రి నేనే ఆచీటీ పడవేశాననుకుంటాడు. రేపు నాకు పెళ్లిచేస్తాడు, అనుకుంటున్నా. పునుగు గమగమ గుబాళించింది. నల్లని ఆకారం నాకేసి చూస్తూ (నవ్వుతూకూడా కామోసు) మెల్లమెల్లిక్క కుడిప్రక్కగది వేపు వెళ్ళింది. ఓరోకలిగా వున్న తలుపుతోసుకుని లోపలికి వెళ్ళింది. తలుపు తిరిగి మూసుకుంది. చడి చెయ్యకుండా నేను యివతల నిలబడి చూస్తున్నా, తలుపు కన్నంలోంచి.

అలిమేలు మొగలాయి సౌధాంతరాలలో నివసించే తార్తారు సుందరిలా గోచరించింది. తప్తకాంచనం వంటిశరీరంమీద నీలాంబరం పట్టుచీర, నెమ్మిక అంచుల జంపరు, రవ్వలదుద్దులు, తళుక్ తళుక్ అనే బేసరి, కళ్ళుమిరుమిట్లు గొల్పుతున్నాయి. ఆసాహసురాలు చినార్ కుంకుమ బొట్టు తీర్చి దిద్దింది. దానిలోని తళుకు ముఖం కదలినప్పుడెల్లా కిరణజాలాలు ప్రసరిస్తూంది.

వెళ్ళగానే ఆమె శాస్త్రికి నమస్కరించింది. అతడా నమస్కారాన్ని బాకులవంటి చూపులతో సత్కరించేడు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలో చాలాభాగం నాకు వినపడలేదు. కాని నిముషనిముషానికి అతడు వర్ధమాన చండకిరణుడివలె వేడెక్కిపోయేడు. ఆమె నవనీతంలా కరిగిపోయింది. చివరకామె మోకరిల్లి అతని పాదాలమీద వాలి గాద్గదికతో రోదించింది. అతడు వెనక్కు జరిగి, పెదవులు బిగించి ఆమెవేపు తృణీకారంగా చూసేడు. తక్షణం వెడిపొమ్మని ఆజ్ఞాపించేడు. నేనిక అక్కడ నిలవలేకపోయేను.

మరికొన్ని నెలల తరువాత వకుళం పెళ్ళయి అత్తవారింటికి వెడిపోయింది. ఆ పిల్లకీ నాకూ మధ్య యేవిధమైన బాకీలు లేవు. అలిమేలు డాక్టరీ చదవడానికి విశాఖపట్నం వెడిపోయింది. మూడేళ్ళతరువాత నేను కాలానుసరణంగా దేశంనాలుగు మూలలా పరిభ్రమించేను. యుద్ధవిమానాల గోల చల్లారేకా నేనా కనుబొమలపై వెంట్రుకలవంటి ప్రభుత్వోద్యోగంలో పడ్డాను.

ఆపతంజలి శాస్త్రి ఆ వేళయింటికోసం అర్జీ పట్టుగు వచ్చేడు. తరవాత కొన్నాళ్లకి వొకనాడు నా గదిలో కూచుని యేదో వ్రాసుకుంటూండగా— మా యింటిగలవారు పెళ్లిలో వంటనిమిత్తం వొక బ్రాహ్మడితో మాట్లాడుతున్నారు. అతడు లాడూ పూసకడతానని, వుండలు చెయ్యనని, వంటలు చేస్తానని, వడ్డించనని యేవోషరతులు చెపుతున్నాడు— నేను తలుపు కొంచెం తీసిచూసేను. ఆ పతంజలి శాస్త్రి!

మరికొన్నాళ్ళకు గాజద్దాల తలుపులుండే బండీ తోసుకుని, పకోడీ, కారపుపూసా అమ్ముకునే వొక బ్రాహ్మడిని చూసేను—ఆ పతంజలి శాస్త్రి!

ఇంకొక సందర్భంలో వొక బ్రాహ్మడిని అడిగేను, 'ఫలానా' మనిషిగురించి తెలుసా అని. అతడన్నాడు—

'వాడి పూర్వ చరిత్ర యెవ్వరికీ తెలిసినట్టు లేదు బాబూ! ఇక్కడివాళ్ళకు తెలిసినంతవరకూ వాడొక భ్రష్టుడు. ఎక్కడినుంచో వొక హీనకులజని లేవదీసుకు వచ్చేడు. పెండ్లిభార్య పిల్లలను, సుమారుగా విడిచిపెట్టేనట్టే. ఆకులంలేని దానింట్లోనే వుంటాడు. దానివంటే తింటాడు—వాహకత్వానికి చాల్నని వూరుకున్నాం మేమంతా'

'ఆ ఆడదాని పేరు తెలుసా ?'

అతడు పొడుంపీల్చబోయి, ఆగి 'ఎవరైతే యేం బాబూ, చెడిపె, అంటారు, దానిపేరు 'పైడి' అన్నాడు.